క్లుప్తంగా

బోయిన్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైదరాబాద్ చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్ర ప్రసాద్‌నాయక్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లిలోని రోడ్డు వెడల్పు పనులు గురించి చర్చించారు. ఈ పనులు త్వరగా పూర్తి చేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఉన్నాయని వారికి నష్టపరిహారం త్వరగా అందించేటట్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కార్పొరేటర్ పాదయాత్ర



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో 90శాతం పనులు పూర్తయ్యాయని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. పాదయాత్రలో భాగంగా మంగళవారం ఆయన ధరణీనగర్, పాపమ్మ కాలనీ, చంద్రమ్మ నగర్, పంచమి కాలనీ, హనుమాన్ నగర్ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంత మేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బీజేపీ పార్టీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు జక్కుల రాజు, కూకట్‌పల్లి డివిజన్ కార్యదర్శి సాయి కిరణ్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నామని తెలిపారు. మంగళవారం వీరికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణాధికారి జీఏకే కృష్ణ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. రెండు నెలల 15 రోజులకు హుండీ ఆదాయం 1,04,809 రూపాయలు వచ్చిందన్నారు. అదే విధంగా మోతీనగర్, హైమావతినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆరు నెలలకు 2 లక్షల 8 వేల 424 రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు.

మహ్మద్ ఆరీఫ్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని మంగళవారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ ఆరీఫ్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్‌ఖాన్, ఉర్దూ విభాగం మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫరూఖ్‌భక్షి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన 'ఆజాదీ కే బాద్ ఉర్దూ మే తవీల్ నజ్మ్ నిగరీ కా తంఖీదీ తజ్జియా'అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో వైవా నిర్వహించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

నిషేధిత డ్రగ్స్ స్వాధీనం

ఒకరి అరెస్టు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నిషేధిత డ్రగ్స్

బాలానగర్: బాలానగర్ పోలీసుల, ఎస్‌ఓటీ మేడ్చల్ జోన్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిషేధిత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు బాలానగర్ సీఐ భాస్కర్ తెలిపారు. ఓపియం అనే నిషేధిత డ్రగ్స్‌ను అమ్మడానికి శోభనకాలనీలోని కూరగాయల మార్కెట్‌కు వచ్చిన రాజ్‌పురి (25) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. రాజస్థాన్‌కు చెందిన ఇతను వినాయకనగర్‌లో నివాసం ఉంటున్నాడు. 100 గ్రాముల చొప్పున 5 ప్యాకెట్లు మొత్తం 500 గ్రాముల డ్రగ్స్‌ను, యాక్టివా వాహనం, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నీటి గోస తీర్చిన ఘనత మాదే..

● ప్రగతి నివేదన సభలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ● సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం



ప్రగతి నివేదన సభకు భారీగా హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే



మూసాపేట: మూసాపేట జనతానగర్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రగతి నివేదన సభ మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... 2014కు ముందు నీళ్లు కావాలి అంటే ట్యాంకర్ బుక్ చేసుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ఈ ప్రాంతంలో నీళ్ల గోస తీర్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కరెంటు లేక పవర్ హాలిడే ఉండి.. ఉద్యోగ భద్రత లేక ఎంతో మంది ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కుల మతాలకు అతీతంగా కల్యాణ లక్ష్మి కింద ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. నా ఆడబిడ్డల కోసం నియోజకవర్గంలో త్వరలో డ్వాక్రా భవనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మూసాపేటలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని వారి కోసం 2 ఎకరాల్లో భవనం నిర్మించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి ప్రజల నీరాజనాలు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర మంగళవారం మూసాపేట డివిజన్‌లో కొనసాగింది. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన మారుతినగర్, మూసాపేట ఓల్డ్ విలేజ్, యాదవబస్తీ, జిల్లాబస్తీ, చైతన్య బస్తీ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. ప్రజలు అడుగడుగునా పూలవర్షం, హారతి ఇచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

50 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించాం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో 23వ రోజు పాదయాత్ర నిర్వహించామన్నారు. స్థానిక ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారని అన్నారు. మూసాపేటలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉందని తెలిపారని ఆయన అన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో మంచినీరు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. మంచినీటి పైపులైన్లు పునరుద్ధరిస్తున్నామని, పురాతన పైపులు తొలగించి కొత్తవి వేస్తున్నామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మూసాపేట డివిజన్‌లో 50 సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించామన్నారు.

ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడు మాధవరం: కార్పొరేటర్

◆ అనంతరం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. డివిజన్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే వాటిని వెంటనే నిధులు మంజూరు చేసి పరిష్కరిస్తున్నారని అన్నారు. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాలను పంచుకునే ఏకైక నాయకుడు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులైన వారికి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పర్చుకోవాలని ఆయన సూచించారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్లు విరివిగా అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు.. తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి రుణాలు అందించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణీత గడువులోగా రుణాల మంజూరుకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బ్యాంకులు జూన్ త్రైమాసికంలో 67.70 శాతం లక్ష్యాన్ని సాధించినందుకు ఆయన అభినందించారు. వన్ టైం సెటిల్‌మెంట్‌పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డీఓ తాన్య, నాబార్డ్ డీడీఎం సురభి, జీఎండీఐసీ రవీందర్, జడ్పీ సీఈవో దేవసహాయం, డీఆర్డీవో పద్మజారాణి, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖ,వివిధ బ్యాంకుల మేనేజర్లు,ఉద్యాన శాఖ, మెప్మా, ఎస్సీ కార్పొరేషన్, డీఐసీ, కేవీఐసీ, ఆర్బీఐ, నాబార్డు అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



నాగార్జున హోమ్స్ వద్ద సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నె

భాగ్యనగర్‌కాలనీ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జయభారత్ నగర్, బృందావన్ కాలనీ, నాగార్జున హోమ్స్ కాలనీల్లో రూ.64.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామి నియోజకవర్గంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. సీసీ రోడ్డు వంటి నిర్మాణ విషయంలో నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్‌రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, వార్డు, ఏరియా కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి



ఏడో ఫేజ్‌లోని ప్లేగ్రౌండ్‌లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోచ్ అంజిబాబు, క్రీడాకారులు

కూకట్‌పల్లి: హాకీ చాంపియన్ ధ్యాన్ చంద్ జయంతిని మంగళవారం కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని ప్లేగ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడుసార్లు గోల్డ్ మెడల్ సాధించిన ఇండియన్ హాకీ చాంపియన్ అని కొనియాడారు. భారత ప్రభుత్వం పద్మభూషణ్‌తో అతడిని సన్మానించిందన్నారు. హాకీకి ఎంతో పేరు తీసుకొచ్చిన ధ్యాన్‌చంద్ పుట్టిన రోజుని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

సంస్కృత కళాశాలలో ఘనంగా హయగ్రీవ జయంతి



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కూకట్‌పల్లి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వర వేదాంత వర్ధినీ సంస్కృత కళాశాలలో హయగ్రీవ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో వడ్డేపల్లి రాజేశ్వర రావు, కళాశాల ప్రధానాచార్యులు డా. బానోత్ సురేంద్ర, అధ్యాపకులు, కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు డా. బానోత్ సురేంద్ర మాట్లాడుతూ... ఈ కళాశాలను 1928లో శ్రీమాన్ కోయిల్ కందాడై అప్పన్ శఠగోప రామానుజస్వామి స్థాపించారన్నారు. ప్రతి సంవత్సరం హయగ్రీవ జయంతిని అత్యంత వైభవోపేతంగా విద్యార్థులతో నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రావణ పూర్ణిమ రోజు హయగ్రీవుని విశేషంగా పూజిస్తే విద్య, ఐశ్వర్యం, అధికారం, ఆయుష్షు మొదలైనవి లభిస్తాయన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి



రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ మీదుగా గాజులరామారం పోయే రోడ్డు మధ్యలో డివైడర్‌ను రోడ్డు విస్తరణ పనులు చేయకుండానే ఏర్పాటు చేయడానికి నిరసిస్తూ మంగళవారం బీజేపీ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డితో కలిసి బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ మాట్లాడారు. గాజులరామారం నుంచి ఎల్లమ్మబండ వరకు రోడ్డును వెంటనే విస్తరణ చేయాలన్నారు. అలాగే రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను వెంటనే తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. కేటీఆర్ కాలనీ, జయశంకర్‌కాలనీల వద్ద రోడ్డు ఇళ్ల వైపు పెరగకుండా ఖాళీ స్థలం వైపు పెంచి డివైడర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి ఎల్లమ్మబండ వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలన్నారు. తులసీవనం అపార్టుమెంట్ ముందు ట్రాఫిక్ చలాన్ల బెడద లేకుండా వాహనదారులకు ఉపశమని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎత్తరి రమేష్, రాజు, రఘు, చారి, రమేష్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

నీటి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

● కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



బాలానగర్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిదిలోని ప్రతి కాలనీలో నీటి సమస్య, డ్రైనేజీ సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు, గతంలో కంటే ఎక్కువ మంచినీటి విషయంలో ప్రత్యేక దృష్టి సారించినట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్, కళ్యాణినగర్‌లలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం దిశగా చర్యల్లో భాగంగా జలమండలి మేనేజర్ అనిల్ కుమార్, కాంట్రాక్టర్ స్వామితో కలిసి పర్యటించారు. నీటి సమస్యలు తలెత్తకుండా నీటి సరఫరా మెరుగు పర్చాలన్నారు. పురాతన పైపులైన్లను ఆధునీకరించాలని సూచించారు. భూగర్భ డ్రైనేజీ సమస్యలు ఉంటే పరిష్కరించి, డ్రైనేజీ నుంచి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగింప చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, దగ్గుబాటి వెంకటేష్, చంద్రపాల్, శ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవడానికి ఆఖరు తేదీగా ఈనెల 31ని నిర్ధారించినట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్ డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉంటాయని, లక్నో క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలు, సాధారణ సూచనలు, ఇతర వివరాలు అన్నింటినీ యూనివర్శిటీ వెబ్‌సైట్ www.manuu.edu.inలో అందుబాటులో ఉంచామన్నారు.

క్రీడాకారిణికి చేయూత

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా రహేజా కార్ప్ గ్రూప్ కంపెనీ ఇనార్బిట్ మాల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాణ్ సంస్థతో కలిసి నిరుపేద క్రీడాకారులకు చేయూతని అందించే 'ధనుష్ శక్తి' ప్రారంభించింది. ఈ సందర్భంగా ఇనార్బిట్ మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. యువ ఆర్చర్ తానిపర్తి చికిత పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సామగ్రితో పాటు అన్నిరకాల తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ప్రస్తుతం సీనియర్ ఇంటర్ విద్యార్థిని అని, సబ్-జూనియర్ నేషనల్ గేమ్స్‌లో రజత, కాంస్య పతకాలను సాధించి ఈ ఏడాది అక్టోబర్‌లో థాయిలాండ్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతోందని వివరించారు. సమావేశంలో క్రీడాకారిణి చికితతో పాటు శ్రవణ్ కుమార్ గోనె,శరత్ బెలవాడి, మయూర్ పట్నాల తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

హఫీజ్‌పేట్: సామాజిక సేవ చేయడం సంతృప్తిని కలిగిస్తుందని మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సౌలభ్యం కోసం ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను, ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా, రాజకీయాలకతీతంగా సమాజానికి సేవ చేయాలనే మానవతా దృక్పథంతో నెలకొల్పబడ్డ ట్రస్ట్ సేవలు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు భిక్షపతి యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

నవజాత శిశువుల సంరక్షణకు అంబులెన్స్

గచ్చిబౌలి: నవజాత శిశువుల సంరక్షణకు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో నవజాత శిశువుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. పుట్టిన శిశువు నుంచి 40 రోజులు శిశువు సంక్షణ కోసం అంబులెన్స్(108)లో ఆక్సిజన్, ఇంక్యుబెటర్‌తో పాటు అత్యాధునికి సౌకర్యాలున్నాయని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో నిలోఫర్, నిమ్స్ ఆస్పత్రులకు తరలించవచ్చన్నారు. జిల్లాకో అంబులెన్స్ కేటాయించారని, రంగారెడ్డి జిల్లా కోటలో కొండాపూర్ ఆస్పత్రికి అంబులెన్స్ కేటాయించారని వివరించారు.

దివ్యాంగుల కలను నెరవేర్చిన గొప్పవ్యక్తి కేసీఆర్

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎస్ఆర్‌సీ గార్డెన్‌లో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో దివ్యాంగులకు పింఛన్ పెంచిన సందర్భంగా కృతజ్ఞతా సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు శిరీష, సబిహా బేగంలతో కలిసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివ్యాంగుల కలను నిజం చేసిన నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలోనైనా దివ్యాంగులకు ఇంత పెన్షన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. దివ్యాంగుల పెన్షన్‌ను 3016 నుంచి 4016కు చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని దివ్యాంగులు పేర్కొన్నారు.

ఒకటో తేదీ నుంచి మెగా లోక్‌అదాలత్

మేడ్చల్: వచ్చేనెల ఒకటి నుంచి 9వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ తెలిపారు. ట్రాఫిక్ విభాగంలో పాత కేసులు, లైసెన్సులు లేని డ్రైవింగ్ కేసులు, డంకన్ డ్రైవ్ కేసులు, ఇతర కేసులున్న వారు లోక్ అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కవుల వేషధారణలో పంచశీల పాఠశాల విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. నన్నయ్య, తిక్కన, ఎర్రన్న, గిడుగు రామ్మూర్తి, తెలుగుతల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డి. శ్రీనివాసులు విద్యార్థులకు తెలుగు భాషా గొప్పతనం వివరించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలిపారు. తెలుగు కవుల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మూసాపేట: మూసాపేటలోని ప్రగతినగర్ కమిటీ హాల్‌లో మంగళవారం ఎన్ఎస్‌యూఐ యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు నియోజకవర్గంలో బూత్‌స్థాయిలో నాయకులు ఉన్నారన్నారు. వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మరికొద్ది రోజుల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ పెడతామన్నారు.

◆ కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిస్బా, జిల్లా కార్యదర్శి రాహుల్ సింగ్, కూకట్‌పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు జహంగీర్, పల్లపు వేణు, బాల్‌రాజ్, సచిన్, గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ నాయకుడు సునీల్‌కుమార్